
దివ్యాంగుల సంక్షేమానికి చర్యలు 6
అదనపు కలెక్టర్ బీఎస్ లత
ఘనంగా దత్తాత్రేయ నవరాత్రోత్సవాలు 7
భక్తుల ప్రత్యేక పూజలు

మలి విడతలో 941 సర్పంచ్ నామినేషన్లు

జగిత్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మలి విడతలో 144 సర్పంచ్ స్థానాలకు 941 నామినేషన్లు వచ్చాయి. 1,276 వార్డు స్థానాలకు గాను 2,927 నామినేషన్లు దాఖలయ్యాయి.

మండలం	సర్పంచ్‌లు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
జగిత్యాల	5	37	50	117
జగిత్యాల రూరల్	29	179	268	550
రాయికల్	32	205	276	598
సారంగాపూర్	18	119	144	352
బీర్‌పూర్	17	85	136	275
మల్యాల	19	151	186	526
కొడిమ్యాల	24	165	216	509
మొత్తం	144	941	1,276	2927

నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలి

-రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు గాజర్ల రమేష్



నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర పరిశీలకుడు రమేష్

జగిత్యాలరూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు గాజర్ల రమేష్ అధికారులకు సూచించారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని చల్గల్, అంతర్గాంతో పాటు సారంగాపూర్ మండలంలోని సారంగాపూర్ నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా సెంటర్లలోని ఆన్‌లైన్ డేటా ఎంట్రీని క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి, సారంగాపూర్ ఎంపీడీవో మహమ్మద్ సలీం పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా పరిశీలకుడు

మల్యాల, డిశంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మండలంలో ఏర్పాటు చేసిన మల్యాల, ముత్యంపేట క్లస్టర్ నామినేషన్ కేంద్రాలను జిల్లా అబ్జర్వర్ రమేశ్ పరిశీ లించారు. అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియను అడిగి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీపీవో రఘువరన్, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ఆమని ఉన్నారు.

సర్పంచ్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

ధర్మపురి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలో సర్పంచ్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా అసిస్టెంట్ ఎన్నికల అధికారి, ఇన్‌చార్జి ఎంపీడీవో నరేష్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల ఆర్‌వోలు, ఏఆర్‌వోలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో ఆర్‌వోలు, ఏఆర్‌వోలు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించిన నుండి ఎన్నికల ఓటింగ్ జరిగి, ఫలితాలు ప్రకటించే వరకు తమ విధులు సక్రమంగా నిర్వర్తించాలని తెలిపారు. అనంతరం ఆర్‌వోలు, ఏఆర్‌వోలకు ఎన్నికల సామగ్రి పంపిణీ చేసి తగు సలహాలు, సూచనలు అందించారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించి, ఎన్నికలు సక్రమంగా నిర్వర్తించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, మండల పరిషత్ సూపరింటెండెంట్ రాణి, సీనియర్ అసిస్టెంట్ అజయ్ కుమార్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీధర మహేష్, బోగ శివప్రసాద్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే లక్ష్యం సాధ్యం



రిపోర్టును ప్రిన్సిపాల్ రామకృష్ణకు అందిస్తున్న ఆడిటర్లు

జగిత్యాల, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతో పనిచేయడంతోనే లక్ష్యం సాధ్యమవుతుందని జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం కళాశాల విద్యా కమిషనర్ ఉత్తర్వుల మేరకు అకాడమిక్ ఆడిట్ బృందం తనిఖీల్లో భాగంగా హుజూరాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాదేవి, డాక్టర్ శ్రీనివాస్ అకాడమిక్ ఆడిటర్ సలహాదారులుగా కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా కళాశాలలోని అన్ని విభాగాలను సంయుక్తంగా పరిశీలించారు. వివిధ విభాగాల అధ్యాపకులు ఆయా రంగాల్లో విద్యార్థులు సాధించిన విజయాలను అంశాల వారీగా సమర్పించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్, కళాశాల చరిత్ర లెక్చరర్ సాసాల మల్లికార్జున్, ఇంగ్లీష్ లెక్చరర్ జ్యోష్ణ, తెలుగు లెక్చరర్ డాక్టర్ శ్రీలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

లెక్క దాటితే వేటే..



- పంచాయతీ ఎన్నికల్లో వ్యయ పరిమితి
- జనాభా ప్రాతిపదికన ప్రచారానికి ఖర్చు
- మేజర్ పంచాయతీల్లో సర్పంచ్‌కు రూ.2.50 లక్షలు
- ప్రత్యేక యంత్రాంగంతో అధికారుల నిఘా

జగిత్యాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పల్లె పోరులో అధిక వ్యయానికి అడ్డుకట్ట వేయడానికి ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. ఇందుకు వ్యయ పరిమితిని విధించడంతో పాటు గ్రామాల్లో ప్రత్యేక యంత్రాంగంతో నిఘా ఏర్పాటు చేసింది. రోజురోజుకూ పెరుగుతున్న ఎన్నికల వ్యయాన్ని నియంత్రించడానికి ఎన్నికల సంఘం కఠినంగా వ్యవహరిస్తోంది. అభ్యర్థులు ఎంత ఖర్చు చేయాలనే విషయంలోనూ స్పష్టమైన పరిమితులు విధించింది. అయితే ఎన్నికల సంఘం



పేర్కొన్న నిబంధనలకు ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులకు ఏ మాత్రం పొంతన ఉండడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల కమిషన్ (ఈసీ) పరిమితికి మించి అభ్యర్థులు పది నుంచి ఇరవై రెట్లు ఎక్కువ వెచ్చిస్తున్నారు. ధన ప్రవాహ కట్టడికి కలెక్టర్ సత్యప్రసాద్ నేతృత్వంలోని యంత్రాంగం ప్రత్యేక నిఘా పెడుతోంది. ఎన్నికల ఖర్చుకు సంబంధించిన నిబంధనలు నవంబరు 27వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. ఇప్పటికే జిల్లాలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసిన పోలీసులు పకడ్బందీగా వాహనాల తనిఖీ చేస్తున్నారు. జిల్లా వ్యయ నిర్వహణ నోడల్ అధికారిగా జిల్లా ఆడిట్ అధికారి సుజాత వ్యవహరిస్తుండగా, జిల్లా వ్యయ పరిశీలకుడిగా పెద్దపల్లి ఆడిట్ అధికారి ఎం.మనోహర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

రోజు వారీగా లెక్కలు..

పోటీ చేసే ప్రతి అభ్యర్థి నామినేషన్ల నుంచి ఎన్నికలయ్యే వరకు ప్రచార కార్యక్రమాల నిమిత్తం ఎంత ఖర్చు చేయాలనే విషయంలో స్పష్టమైన నిబంధనలున్నాయి. ఏయే అవసరాలకు ఎంత ఖర్చు చేయాలనే విషయాలను ఈసీ స్పష్టం చేసింది.

గతంలో ఎన్నికల ఖర్చును మూడు రోజులకు లేదా పోలింగ్ పూర్తయిన తర్వాత కౌంటింగ్ వరకు చూపించే వీలు ఉండేది. ప్రస్తుత ఎన్నికల్లో మాత్రం అభ్యర్థి తాను చేస్తున్న ఖర్చును రోజువారీగా అధికారులకు చూపించాలి. అంతేకాకుండా వివరాలను ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధానాధికారి వెబ్‌సైట్‌లో సైతం నమోదు చేయాలని నిబంధన ఉంది. నేర చరిత్ర కలిగిన అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేస్తే వాటికి సంబంధించిన వివరాలను కూడా నమోదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రతీ నిత్యం మందు...విందులు..

ఎన్నికల కమిషన్ నిబంధనలతో అభ్యర్థులు జాగ్రత్తగా ఉండాలని ఆయా పార్టీలు ముందుగానే తమ మద్దతుదారులకు మిగతా 8వ పేజీలో..

పరిమితికి లోబడి వ్యయం చేయాలి: సత్యప్రసాద్, కలెక్టర్



పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు ఎన్నికల సంఘం విధించిన పరిమితికి లోబడి వ్యయం చేయాలి. ఎప్పటికప్పుడు ఎన్నికల వ్యయానికి సంబంధించిన లెక్కలు అప్పగించాలి. పరిమితికి మించి వ్యయం చేస్తే చర్యలు తప్పవు.

6న పోలింగ్ సిబ్బందికి శిక్షణ

కథలాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణలో ఈ నెల 6న పంచాయతీ ఎన్నికల పోలింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. పోలింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్, రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 226 మంది సిబ్బంది వివరాలు ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు.

దివ్యాంగులకు ఓడీ సౌకర్యం

జగిత్యాల అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 3 వతేదీన అదర్ డ్యూటీ(ఓడీ) సౌకర్యం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జగిత్యాల జిల్లా సీనియర్ సిటీజన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ తెలిపారు. మహిళలు, పిల్లలు, వికలాంగులు, సీనియర్ సిటిజన్స్ ప్రభుత్వానికి నివేదించిన దృష్ట్యా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహించే వేడుకల్లో పాల్గొనేందుకు వీలుగా ఈనెల 3న దివ్యాంగ ఉద్యోగులందరికీ ఓడీ సౌకర్యం కల్పి జీఓ నంబర్ 1683 ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

మిషన్ భగీరథ పంప్‌హౌస్ పరిశీలన

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మిషన్ భగీరథ పంపుహౌస్ వద్ద నిర్మిస్తున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులను అదనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి రాజాగౌడ్ పరిశీలించారు. మంగళవారం ఆయన మిషన్ భగీరథ పంపుహౌస్‌ను, పంప్‌హౌస్ కోసం నిర్మిస్తున్న ప్రహరీ గోడను పరిశీలిచి అధికారులకు పలు సూచనలు చేశారు. పనులు నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మోహన్, ఏఈ దీపక్ పాల్గొన్నారు.

నేటి నుంచి మూడో విడత నామినేషన్లు



- 119 పంచాయతీలు, 1,088 వార్డులకు ఎన్నికలు
- 1,75,024 మంది మూడో విడత ఓటర్లు

జగిత్యాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం నుంచి మూడో విడత నామినేషన్ల పర్వం మొదలు కానుంది. మూడో విడత నామినేషన్లను ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించనున్నారు. 6వ తేదీన నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటు అయిన నామినేషన్ల ప్రకటన, 7వ తేదీ వరకు అప్పీల్, 8వ తేదీన అప్పీల పరిష్కారం, 9వ తేదీ వరకు నామినేషన్ల ఉప సంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన, 17వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించి ఫలితాలను ప్రకటించనున్నారు.

మండలాలు	పంచాయతీలు	వార్డులు	పోలింగ్ స్టేషన్లు	ఓటర్లు
ధర్మపురి	25	224	224	35,389
బుగ్గారం	10	96	96	17,347
ఎండపల్లి	15	138	138	24,077
వెల్గటూరు	19	168	168	22,684
గొల్లపల్లి	27	246	246	39,658
పెగడపల్లి	23	216	216	35,869
మొత్తం	119	1,088	1,088	1,75,024

పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

రాయికల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. రాయికల్ మండలంలోని ఒడ్డెలింగాపూర్, కొత్తపేట, అల్లీపూర్ గ్రామాల్లో నామినేషన్ ప్రక్రియను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం రిజర్వేషన్ల వివరాలు నోటీస్ బోర్డుపై సక్రమంగా ప్రదర్శించ బడ్డాయా, లేదా అనే విషయాన్ని పరిశీలిం చారు. ప్రస్తుతం ఇప్పటివరకు ఎన్ని నామినేషన్లు స్వీకరించబడాయి, అలాగే నామినేషన్ల పత్రాలు ఎంత మంది అభ్యర్థులు తీసుకున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొర పాట్లు జరుగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలన్నారు. నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్నవారి వివరాలను కూడా రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీవో చిరంజీవి పాల్గొన్నారు.



నామినేషన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

మంత్రి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం అందరు కలిసి కట్టుగా కృషి చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పిలుపు నిచ్చారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తీగలధర్మారం మాజీ ఉపసర్పంచ్ పందిరి అశోక్, గూళ్ల గంగన్న, మహ్మద్ శంషోద్దీన్, రషీద్ తమ అనుచరులతో కలిసి ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ వారందరికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండు ఏళ్ల కాలంలో అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు చేరువయ్యిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థులను సర్పంచ్ ఎన్నికల్లో గెలిపిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆయన తెలిపారు. డబ్బు, మద్యానికి ఆశపడి ఎన్నికల్లో ఓట్లు వేస్తే గ్రామాలు ఎంతో వెనుకబడి పోతాయని ఆయన అన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలను అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని ఆయన వివరించారు. ఎన్నికల్లో కష్టపడి అన్ని గ్రామాల సర్పంచ్ పదవులు చేజిక్కించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీ సీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాం గ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు సింహరాజు ప్రసాద్, మాజీ సర్పంచ్ జంగిలి ప్రభాకర్, గందం గంగన్న, జంగిలి రవీందర్, దాసరి పురుషోత్తం, అంకూస్, చాంద్‌పాషా, సల్లూరి రాజేష్ పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

నగదు, మద్యం తరలిస్తే చర్యలు

ఎస్పీ అశోక్‌కుమార్

కొడిమ్యాల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సర్పంచు ఎన్నికలకు సంబంధించి అక్రమంగా నగదు, మద్య తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న కొడిమ్యాల మండలంలోని దొంగలమర్రి పోలీస్ చెక్ పోస్టును జిల్లా ఎస్పీ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల నేపద్యంలో జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీని ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఉచిత పంపిణీలు, నగదు, మద్యం, ఇతర ప్రలోభాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుం దన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టి ఎలాంటి చర్యలకు పాల్పడిన చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అన్ని శాఖల సమన్వయంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌ను కఠినంగా అమలు చేస్తున్నామన్నారు. సరైన ఆధారాలు లేకుండా భారీ మెత్తంలో నగదు తీసుకెళితే డబ్బును సీజ్ చేస్తామన్నారు. చెక్ పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా, పకడ్బందీగా తనిఖీ చేస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అత్యవసరా లకు నగదును తీసుకెళితే తగిన బిల్లులు, పత్రాలు వెంట ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ తనిఖీ సమయంలో మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్, హెడ్ కానిస్టేబుల్ కనకయ్య, ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం కరుణాకర్, విమల, జీపీవో విజయ్, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



రికార్డును పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

అనుమతి లేకుండా నిరసనలు చేపట్టరాదు

జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా పరిధిలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ యాక్ట్ 1861 డిసెంబర్ 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఈ యాక్ట్ ప్రకారం పోలీస్ అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, నిరసనలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, నిబంధనలకు విరుద్ధంగా డీజే వినియోగించరాదని తెలిపారు. శాంతి భద్రతలకు విగాతం, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే విధంగా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఎస్పీ సూచించారు.

రక్త నమూనాల సేకరణకు కదిలిన వాహనాలు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

జగిత్యాల టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన వైద్య అధికారులు మంగళవారం రక్త నమూనాలు సేకరించే వాహన యజమానులతో మాట్లాడి జిల్లాలో పలు ప్రభుత్వ ఆసుపత్రులకు రక్త నమూనాలు సేకరించేందుకు వాహనాలు పంపారు. ఆంధ్రజ్యోతిలో ప్రభుత్వాసుపత్రుల్లో నిలిచిన రక్త నమూనాల సేకరణ అనే వార్త మంగళవారం ప్రచురితం అయింది. జిల్లాలో ఉన్న 17 పీహెచ్‌సీలు, 5 యుపీహెచ్‌సీలు, జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిల నుంచి రోగుల వద్ద ప్రతిరోజు రక్త నమూనాలను సేకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 5 వాహనాలలో జిల్లా కేంద్రంలోని వైరాలజీ ల్యాబ్‌కు తీసుకొని వస్తారు. అయితే ఆ వాహనాలకు 8 నెలలుగా 13.20 లక్షల బిల్లులు చెల్లించక పెండింగ్‌లో ఉండి వాహనాలను సోమవారం నిలిపివేశారు. ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన జిల్లా వైద్య అధికారి డా. ప్రమోద్ కుమార్ వాహన యజమానులతో మాట్లాడి 10 రోజులలోగ బిల్లు చెల్లిస్తామని హామి ఇవడంతో వాహనాలు రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు తీసుకుని వచ్చాయి.

ఆటో, స్కూటీ ఢీ..

● ముగ్గురికి తీవ్ర గాయాలు



ఢీకొన్న ఆటో, స్కూటీ

వేములవాడ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని రెండోబైపాస్ రోడ్డులోగల దోబీఘాట్ వద్ద మంగళవారం ఆటో, స్కూటీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో ఆటోడ్రైవర్ భరత్‌కు, మరో ప్రయాణికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్కూటీపై వెళ్తున్న అర్చకుడు ప్రసన్న కాలు విరిగింది. క్షత గాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

ఇసుక లారీని ఢీకొన్న యువకుడు

● తీవ్ర గాయాలు

వీణవంక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామంలో ఇసుక లారీని ఢీకొని గూడిపాటి రాంరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం ధర్మారం గ్రామానికి చెందిన రాంరెడ్డి ద్విచక్ర వాహనంపై చల్లూరు నుంచి మామిడాలపల్లికి వెళ్తుండగా పార్కింగ్ సిగ్నల్స్ లేకుండా రోడ్డుమీద నిలిపిన ఇసుక లారీని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ రాంరెడ్డిని స్థానికులు వెంటనే 108లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. రాంరెడ్డి సోదరి కాసర్ల ప్రత్యూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

వరి కొయ్యలు కాలిస్తే ముప్పే..



వేములవాడ పట్టణం నాంపల్లిలో వరికొయ్యలకు నిప్పుపెట్టిన రైతు

- భూసారం కోల్పోయి తగ్గనున్న దిగుబడి..
- కలియ దున్నితే పోషక పదార్థాల శాతం పెంపు
- సూచనలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు

వేములవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులు వరిపంటను సేకరించిన తరువాత వరి కొయ్యలను కాల్చుతే వచ్చే దిగుబడులపై ముప్పు వాటిల్లనుంది. వరి కొయ్యలను (కొయ్యకాలు) కల్చాతే నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని, కాల్చడంతో విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుందనే విషయాన్ని రైతులకు గుర్తుంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం చెబుతున్నాడు. వేములవాడ డివిజన్ పరిధిలో రైతులు పంట సేకరించిన తరువాత కొయ్యలను నిప్పంటించి తగలబెడుతున్నారు. గతంలో పంటను కొడవళ్ల సహాయంతో మొదళ్ల వరకు కోసేవారు. పశువులు ఎక్కువగా గ్రామాల్లో ఉండటంతో కొయ్యలను కింది వరకు కట్ చేసి గడ్డివాములు వేస్తూ వరి గడ్డిని నిలువ చేశేవారు. ప్రస్తుతం సాగు విధానంలో మార్పులు రావడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. మిషన్‌తో వరి పంటను కట్ చేయడంతో కొయ్యలు పెద్దగా మిగిలి పోతున్నాయి. దీంతో పొలం సాగు సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయనే ఉద్దేశ్యంతో ఎక్కువ శాతం రైతులు కొయ్యలను తగలబెడుతున్నారు. వరికొయ్యలను తగలబెడితే అధిక నష్టాలు వచ్చే అవకాశముందని, రైతులు వ్యవసాయాధికారుల సూచనలు,సలహాలు పాటించాలని సూచిస్తున్నారు.

● అధిక ఉష్ణోగ్రతతో సారాన్ని కోల్పోతుంది..

పంట పొలంలో ధాన్యం సేకరించిన తరువాత కొయ్యలకు నిప్పు పెట్టడంతో అధిక ఉష్ణోగ్రత వెలువడుతుంది. దీంతో పంట దిగుబడిపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా భూమిలో ఉండే నత్రజని, పాస్పరస్ లాంటి పోషక విలువల శాతం తగ్గి దిగుబడి తక్కువ వస్తుంది. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కోల్పో తాయి. పంటకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. భూ మిలో ఉన్న సూక్ష్మ జీవులు, వానపాములు, జీవరాసులు చనిపోతాయి.

● వరి కొయ్యలతో కలిగే ప్రయోజనాలు..

వరి పంటను సేకరించిన పిదప కొయ్యలను నేలలో కలియ దున్నడంతో సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు 10 శాతం వరకు పెరిగే అవ కాశం ఉటుంది. దుక్కిని దున్నే సమయంలో సిం గిల్ సూపర్ ఫాస్పెట్‌ను చల్లితే పక్షం రోజుల్లో కొయ్యలు మురిగి పోషకాలుగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉటుంది. దీంతో డీఏపీ వాడకం సగం వరకు తగ్గించి పెట్టుబడిని ఆదా చేసుకునేందుకు వీలుగా ఉంటుంది. కొయ్యలను కలియ దున్నితే ఒక ఎకర పొలంకు దాదాపుగా టన్ను వరకు ఎరువుతో పాటుగా మొక్కలకు 2 శాతం నత్రజని (యూ రియా) 4 శాతం ఫాస్పరస్ అదనంగా అం దుతుంది. మాంగనీస్, జింక్ కాల్షియం, ఇనుము వంటివి పంటకు ఎంతో మేలు చేకురుస్తాయి. భూ మిలో కరగని మాలకాలను పంటకు అనుకూలంగా మార్చి నీటి నిల్వ సామర్థ్యం పెరిగేం దుకు దోహదపడుతుంది.

ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది..

- జిల్లా వ్యవసాయాధికారిణి అఫ్జల్ బేగం

ప్రతి రోజు ఒక మండలం చొప్పున రైతులకు వరి కొయ్యలను తగలబెడుతే వచ్చే ప్రమాదాలు, తగ్గె దిగుబడులపై రైతులకు అవగహన కల్పిస్తున్నాం. దీంతో పాటుగా వాతావరణ కాలుష్యంతో పాటుగా రైతుల శ్వాసకోశ వ్యాధులకు గురికావడం, వరికొయ్యలకు నిప్పు అంటించడంతో అధిక మంటలు వ్యాపించి ప్రమాదాల బారిన పడిన సంఘటనలున్నాయి. రైతులు తప్పకుండా వ్యవసాయాధికారుల సలహాలు సూచనలను తప్పకుండా పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. వరికొయ్యలను దమ్ము చేసి మురగపెడితే దిగుబడి పెరుగుతుంది.

ఉమ్మడి జిల్లాలో నలుగురి బలవన్మరణం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వివిధ కారణాలతో ఉరివేసుకుని నలుగురు బలవన్మరణం చెందారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. వివరాల్లోకి వెళితే..

ఆర్థిక ఇబ్బందులతో మరమగ్గాల కార్మికుడి ఆత్మహత్య..



బోడ శేఖర్(ఫైల్)

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణతో పాటు మరమగ్గాల పరిశ్రమ ఏర్పాటుకోసం చేసిన అప్పులు పెరిగి పోవడంతో వాటిని తీర్చేమార్గం లేక బోడ శేఖర్(38) అనే మరమగ్గాల కార్మికుడు మంగళవారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన రాజన్నసిరిసిల్లకేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని జ్యోతినగర్‌కు చెందిన బోడ శేఖర్ తనకున్న స్థలంలో అప్పులు చేసి మరమగ్గాల పరిశ్రమను ఏర్పాటుచేసుకున్నాడు. రెండు సంవత్సరాల క్రితం సంక్షోభం తలెత్తడంతో పనులు లేక మరమగ్గాల పరిశ్రమను బంద్ చేసి శేఖర్ మరో చోట మరమగ్గాల కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మరమగ్గాల పరిశ్రమల ఏర్పాటుతోపాటు కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు వడ్డీతో కలిపి రూ.40లక్షలవరకు పెరిగిపోవడంతో వాటిని తీర్చేమార్గం లేక మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శేఖర్‌కు భార్య లావణ్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ఇల్లంతకుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన కుమ్మరవేని లత (28) అనే వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లత మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని మృతిచెందింది. మృతురాలికి 5 సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. మృతిచెందడానికి గల కారణాలు తెలియవలసి ఉంది. వివాహిత మృతిపై ఎస్సై సిరిసిల్ల అశోక్ మాట్లాడుతూ ఇంతవరకు ఎవరు ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు.

ఉరి వేసుకుని యువతి బలవన్మరణం

సుల్తానాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఎనగంటి రిక్షిత(18) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎనగంటి శ్రీనివాసు-రజిత దంపతుల కూతురు ఎనగంటి రిక్షిత కరీంనగర్ లోని ఓ హాస్టల్ ఉంటూ ఇంటర్ విద్య అభ్యసిస్తోంది. ఆరోగ్యం బాగా లేకపోవడంతో హాస్టల్ నుంచి వారంరోజుల కిందట ఇంటికి వచ్చింది. మంగళవారం హాస్టల్‌కు వెళ్లాల్సిఉండగా ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని కుటుంబసభ్యులు తెలిపారు. తల్లి రజిత ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని సుద్దాల నుంచి పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ఆస్పత్రికితరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి ఆత్మహత్య



విజ్ఞాన్(ఫైల్)

శంకరపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన ఓ విద్యార్థి ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం రాజాపూర్ గ్రామానికి చెందిన రెడ్డి విజ్ఞాన్ (21) ఉస్మానియా క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విభాగంలో మైనింగ్ డిపార్ట్‌మెంట్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం క్యాంపస్‌లోని ఆక్సిజన్ పార్కులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విజ్ఞాన్ మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మంగళవారం స్వగ్రామం రాజాపూర్ తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. విజ్ఞాన్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతికి సంబంధించి కారణాలు తెలియాల్సి ఉంది.

నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలని దాడి..

● నలుగురిపై కేసు నమోదు

తంగళ్లపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలని బెదిరింపులకు పాల్పడి దాడిచేసిన నలుగురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ ఉపేంద్రచారి తెలిపారు. తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ ఒకటవ వార్డుకు సుంకపాక శరత్ నామినేషన్ దాఖలు చేశాడు. నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలని అదే గ్రామానికి చెందిన దేవచంద్రం, సాయి, కంకర రాజు, కంకర కిషన్ దాడిచేసి చంపుతామని బెదిరింపులకు పాల్ప డ్డారు. సుంకపాక శరత్ పెద్దనాన్న సుంకపాక దేవయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుమేరకు నలుగురిపై కేసునమోదు చేసుకునిదర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

జమ్మికుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాదిజమ్మికుంటలో అక్రమంగా నిల్వఉంచిన మద్యం బాటిళ్లను మంగళవారం పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. బోళ్ల శంకర్ అనేవ్యక్తి మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా పోలీస్‌లు పట్టుకున్నారు. అతడివద్దఉన్న రూ.5790విలువగల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పట్టణసీఐ ఎస్ రామకృష్ణాగౌడ్ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌గడ్డకు చెందిన ముస్తాఫా అనేవ్యక్తి గత ఫిబ్రవరి 25న తన సెల్‌ఫోన్‌ను బొమ్మకల్‌లో పోగొట్టుకోగా కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆ ఫోన్ వరంగల్‌లో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేశారు. ఆ సెల్‌ఫోన్‌ను కరీంనగర్ రూరల్‌సీఐ ఏ నిరంజన్‌రెడ్డి మంగళవారం యజమాని ముస్తాఫాకు అందజేశారు. ఫోన్ రికవరీకి కృషిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

కారు అదుపుతప్పి.. ప్రమాదం

● ఇద్దరి పరిస్థితి విషమం ● మరో ముగ్గురికి గాయాలు



పల్టీ కొట్టిన కారు



గాయపడ్డ బాలుడికి సీపీఆర్ చేస్తున్న స్థానికులు

తిమ్మాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌రహదారిపై ఓ కారు అదుపుతప్పి డివైడర్ పైనుంచి దూసుకువచ్చి అవతలివైపు వెళ్తున్న మరోకారుపై పడింది. ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ కట్టరాంపూర్‌కి చెందిన పెండ్యాల కిషన్‌రెడ్డి, ఆయన భార్య పెండ్యాల విజయ, కోడలు పెండ్యాల దివ్య, మనుమండ్లు అహన్(8), 2నెలల వయస్సుగల చిన్నబాబుతో కలిసి హైదా రాబాద్ నుంచి మంగళవారం కరీంనగర్‌కు వస్తున్నారు. తిమ్మాపూర్ మండలంలోని ఇందిరానగర్ చౌరస్తాకు సమీపంలో రాజీవ్ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా ఉండటంతో అదుపు తప్పి రోడ్డు డివైడర్ పైనుంచి కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపువెళ్తున్న మరో కారుపైకి దూసుకెళ్లి రోడ్డు కిందికి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో కట్టరాంపూర్‌కి చెందిన ఒకే కుటుంబంలోని ఐదుగురికి గాయాలు కాగా అందులో ఇద్దరిపరిస్థితి విషమంగా ఉంది. మరో కారులో బెలూన్‌లు తెరుచుకోవడంతో బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్‌ఐ కలికోట సంతోష్‌కుమార్, టైపిస్ట్ తోడెలు రమేష్, బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న తాడగొండ కనుకయ్య స్వల్పగాయాలతో బయటపడ్డారు. సంఘటన స్థలానికి ఎల్ఎండీ పోలీసులు చేరుకొని క్షతగాత్రులను చికిత్సనిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

విద్యార్థులు, మహిళల భద్రతకు షీటీం ప్రత్యేక చర్యలు



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

జ్యోతినగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థుల భద్రతకు షీ టీం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని షీ టీం మెంబర్ స్నేహలత తెలిపారు. మంగళవారం ఎన్‌టీపీసీ, టీటీఎస్‌లోని సచిదేవా హైస్కూల్, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు చేపడు తున్న భద్రత చర్యలను వివరించి, ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే మొదట తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని, ఆ తర్వాత తమను సంప్రదించాలన్నారు. ఆపద సమయాల్లో డయల్ 100, అలాగే 6303923700కు ఫోన్ చేయాలన్నారు. మొబైల్ ఫోన్‌ద్వారా ఆన్‌లైన్ గేమ్స్, సైబర్ క్రైమ్‌లు పెరుగుతున్నాయని, వాటికి దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాను మంచి కోసం వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్‌కు మోసపోయిన వారు వెంటనే 1930 నెంబర్‌కు సమాచారం ఇస్తే వారు చర్యలు చేపడుతారన్నారు. మహిళల రక్షణకు షీటీం మెంబర్లు పలు రద్దీ ప్రాంతాలు, బస్టాండ్ల వద్ద నిఘా ఉంటుందని తెలిపారు. షీటీం సభ్యులు మౌనిక, సురేష్, ప్రిన్సిపాల్ జ్ఞాన్‌చంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొంగలు బాబోయ్.. దొంగలు

● వరుస చోరీలతో భయం గుప్పిట్లో ప్రజలు



బొంతుపల్లిలో చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)

వీణవంక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బోరు మోటర్ల కేబుల్ వైర్ల చోరీలు పెరిగిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వీణవంక మండలంలోని బేతిగల్ కనపర్తి నర్సింగాపూర్, బొంతుపల్లి గ్రామాల్లో వ్యవసాయబోరు మోటార్ల కేబుల్‌వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కట్‌చేసి ఎత్తుకెళ్తున్నారు. పదుల సంఖ్యలో రైతుల మోటార్ల కేబుల్ వైర్లు ఎత్తుకెళ్తుండడంతో రైతులకు ఇబ్బందిగా మారింది. కొత్త కేబుల్ వైర్లు వేయాల్సి వస్తుండడంతో ఒక్కో రైతుకు నాలుగు నుంచి ఆరువేల ఖర్చు అవుతుండడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. వ్యవసాయ బావులవద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి దొంగలు కాపర్‌తీగ ఎత్తెకెళ్తుండడంతో విద్యుత్ అధికారులకు, రైతులకు ఇబ్బందిగా మారింది. మరోవైపు ఇటీవల కనపర్తిలో ఓ ఇంట్లో బంగారం ఎత్తుకెళ్లారు. వీణవంక గ్రామశివారులో మేకలు మేపుతుండగా మేకను బైకుపై వచ్చి ఎత్తుకెళ్లారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉన్నా పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో దొంగలకు ఆసరాగా మారింది. వరుస దొంగతనాలతో మండల ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి వైర్ల దొంగలపై, ఇతర చోరీలపై ప్రత్యేక నిఘాఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బోయినపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన బోయినపల్లి మండలం తలగొండ గ్రామంలో మంగళవారం జరిగింది. ఆదివారం గ్రామానికి చెందిన ఎడపల్లి అనురాగ్ (22) స్నేహితుడు పిట్టల అఖిల్ తో కలసి బోయినపల్లి నుంచి తడగొండ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. అఖిల్ ద్విచక్రవాహనాన్ని అజాగ్రత్తగా నడపడంతో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అనురాగ్, అఖిలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అనురాగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి రాజేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన అఖిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకాంత్ తెలిపారు.

కొండగట్టు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు దేవస్థానం కింద జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని టీపీఎఫ్‌జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య కోరారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కొండగట్టు అభయాంజనేయ స్వామి గుడి ఆవరణలో జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు 20షాపులు దగ్ధమైనాయని, బాధితులుసర్వం కోల్పోయారని, వారికి వెంటనే రూ.30లక్షల చొప్పున నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. ప్రమాదంలో పలువురు విద్యార్థుల సర్టిఫికెట్లు, పిల్లల పెళ్లికోసం దాచుకున్న డబ్బులు, బంగారం కాలి బూడిదగా మారాయని ఆవేదన చెందారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా ప్రధానకార్యదర్శి పులిపాక రవీందర్, జిల్లాఉపాధ్యక్షుడు గాండ్ల మల్లేశం, జిల్లాకార్యవర్గ సభ్యులు రాజు, సుధాకర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం నగునూర్‌గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నామని కరీంనగర్‌రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌డ్రైవర్ బాతుల వీరయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిని తహసీల్దార్ ఎదుట హాజరుపరచి లక్షరూపాయల సొంతపూచీకత్తుపై బైండోవర్‌చేసినట్లు సీఐ తెలిపారు. మరికొందరు సస్పెక్ట్ షీటర్లను కూడా బైండోవర్ చేసినట్లు తెలిపారు.

మద్యం మత్తులో విగ్రహం ధ్వంసం

ఓదెల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీమరపల్లిలో సోమవారం రాత్రి ఓవ్యక్తి మద్యంమత్తులో భూలక్ష్మి విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. రెండేళ్లక్రితం గ్రామస్థులు భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మద్యం మత్తులో ఓవ్యక్తి విగ్రహం ధ్వంసం చేశాడు. రెండునెలలక్రితం పొత్కపల్లిలోని పెద్దమ్మ ఆలయం ముందున్న పోతరాజు విగ్రహాన్ని మద్యం మత్తులో గుర్తుతెలియని వ్యక్తి ధ్వంసం చేశాడు. వరుస సంఘటనలతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీనగర్ కాలనీలో చోరీ

కరీంనగర్ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శ్రీనగర్ కాలనీలోని ఒక ఇంటిలో దొంగలు చొరబడి 8 గ్రాముల బంగారం ఎత్తుకుపోయారని బాధితులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఇంటికి తాళం వేసిన ఇంటి యజమాని హుస్నాబాద్‌కు వెళ్లి మంగళవారం ఉదయం వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా 8 గ్రాముల బంగారం కనపడకుండా పోయింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ కే సృజన్‌రెడ్డి తెలిపారు.

గంజాయి సేవిస్తున్నారని యువకులను.. అదుపులోకి తీసుకున్న పోలీసులు

జగిత్యాల టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో కొందరు యువకులు గంజాయి సేవిస్తున్నారనే సమాచారం మేరకు పట్టణ పోలీసులు పలువురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వివేకానంద స్టేడియంలో మంగళవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల క్రీడలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడే కూర్చొని ఉన్న కొందరు యువకులు ఏదో సేవిస్తున్నారు. వారి వైపునుంచి వస్తున్న పొగకు ఇబ్బంది పడ్డ ఉద్యోగులు కొందరు యువకులు గంజాయి సేవిస్తు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ పోలీసులు అక్కడికి చేరుకొని ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకోగా మిగతావారు అక్కడి నుండి జారుకున్నారు. యువకులను పోలీస్ స్టేషన్ తరలించిన పోలీసులు విచారించి అది గంజాయి కాదని హుక్కా అని వదిలిపెట్టారు. అయితే అది హుక్కా కాదని గంజాయితో తయారు చేసిన హ్యాష్ అయిల్ అని సంక్షేమ శాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు. దీనిపై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు

● అదనపు కలెక్టర్ బీఎస్ లత ● ఘనంగా దివ్యాంగుల క్రీడాపోటీలు



క్రీడలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగులకు ఆటలపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లత మాట్లాడుతూ దివ్యాంగుల సాధికారత, విద్య, ఉపాధి అవకాశాల విస్తరణ, నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరిస్తూ, దివ్యాంగులు జీవితంలోని ప్రతిరంగంలో ప్రతిభను చాటగల సామర్థ్యం కలిగి ఉన్నారని, సమాజం వారికి ప్రోత్సహించేం దుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వసంక్షేమపథకాల సహకారంతో దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు జిల్లా పరిపాలన అన్నివిధాలుగా సహకరిస్తుందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి దివ్యాంగులు పెద్ద సంఖ్యలో హాజరై రన్నింగ్, షాట్‌పుట్, చెస్, జావెలిన్ త్రో, ఫీల్డ్ ఈవెంట్స్ వంటి వివిధ విభాగాల్లో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచినవారికి త్వరలోనే పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేయబడుతాయని జిల్లాసంక్షేమ అధికారి డాక్టర్‌నరేష్ తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, సాధికారత పరంగా జిల్లాలో మరిన్ని కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లాయువజన క్రీడలఅధికారి రవికుమార్, డీఈవో రాము, సీడీపీవోమమత, ఈవోపవిత్ర, సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్, ఫీల్డ్‌రెస్పాన్స్ అధికారులు కొండయ్య, డీసీపీవో హరీష్, ఎఫ్ఆర్‌వో కొండయ్య, మిషన్‌శక్తిసిబ్బంది, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో వైభవంగా గీతా జయంతి

● కన్నుల పండువగా పూర్ణాహుతి


పూర్ణాహుతి గావిస్తున్న వేదపండితులు


వేములవాడ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి దేవస్థానంలో గీతా జయంతి ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. శనివారం ప్రారంభమైన ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 7-30 గంటలకు నాగిరెడ్డి మండపంలో మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం, అర్చనలు, గీతా హోమంస్వామివారికి ఏకాంతంగా నిర్వహించారు. అనుబంధ ఆలయాల్లో శాస్త్రోక్త పద్ధతిలో ప్రత్యేకపూజలు, అర్చనలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా రాజన్నఆలయంలో ఉదయం 11-15గంటలకు పూర్ణాహుతి, కలశోద్వాసన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎల్ రమాదేవి పాల్గొన్నారు.

భీమన్న సన్నిధిలోని శిలా శాసనాల పరిశీలన


శాసనాన్ని పరిశీలిస్తున్న సాగర్

వేములవాడ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరాలయంలోని ప్రాచీన పురావస్తు విగ్రహాలు, డజన్‌కు పైగా ఉన్న శాసనాలను మంగళవారం కరీంనగర్ పురావస్తు శాఖ సహాయసంచాలకుడు ఎన్ సాగర్, స్థానిక చరిత్ర కారుడు సంకేపల్లి నాగేంద్ర శర్మ పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవోఎల్ రమాదేవిని కలిసి సైట్ మ్యూజియం ఏర్పాటుచేయాలని కోరారు. ఈ సందర్భంగా భీమేశ్వరాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయం గోడకు ఉన్న ప్రాచీనశాసనాన్ని, బాదామి చాళుక్యుల కాలం నాటి వినాయక విగ్రహాన్ని పరిశీలించారు.

వస్తే సర్పంచ్ పదవి.. పోతే ఎకరం..



పైసలుంటేనే పంచాయతీ బరిలో..

● భారీగా ఖర్చు పెట్టేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. డబ్బులు ఖర్చు పెట్టేవారినే సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో ఉంచేందుకు పార్టీల నాయకులు చర్చలు జరుపుతున్నారు. దీంతో ఖర్చు భరించే వారినే అభ్యర్థులుగా ఎంపిక చేసే యోచనలో ఉన్నారు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ పోటీ చేయాలని ఉత్సాహం ఆసక్తి ఉన్న వారికి సైతం సరైన ఆర్థిక స్తోమత లేకపోతే అభ్యర్థులుగా అవకాశం కల్పించే పరిస్థితులు కనిపించడం లేదు. గ్రామానికి సేవ చేయాలనే తపన ఉన్నా డబ్బు లేకపోతే ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితులు లేవు. సామాజికవర్గం సమీకరణలు, ప్రజాదరణతో పాటు ఆర్థిక బలం ఉన్న వారిని అన్వేషిస్తున్నారు.

● జనరల్ స్థానాల్లో రూ. 10 లక్షల నుంచి రూ. 25 లక్షలు

జనరల్, బీసీ స్థానాల్లో పోటీ తీవ్రత అధికంగా ఉంది. ఎంత ఖర్చయినా కొందరు వెనుకాడడం లేదు. ఆశావాహులు తమ అభ్యర్థిత్వాలు ఖరారు కాకముందే గ్రామాల్లో ప్రతిరోజు వేలల్లో ఖర్చు చేస్తున్నారు. సమావేశాలు పెడుతూ తనకే మద్దతు ఇవ్వాలని కోరుతూ ఖర్చు పెడుతున్నారు. జనరల్ పంచాయతీల్లో 10 లక్షల నుంచి 25 లక్షలు ఖర్చు పెట్టే వారికి అవకాశం ఇవ్వాలని పార్టీల నాయకులు చూస్తున్నారు. ఆయకట్టు గ్రామాల్లో సర్పంచ్ పదవికి ఎక్కువ డిమాండ్ ఉంది. అక్కడ 50 లక్షల వరకు ఖర్చు పెట్టేందుకు పలువురు సిద్ధంగా ఉన్నారు. కొన్ని గ్రామాల్లో 25 లక్షల నుంచి 40 లక్షల వరకు ఖర్చు చేసేందుకు సిద్ధమే అంటున్నారు. వస్తే సర్పంచ్ పదవి పోతే ఎకరం భూమి అంటూ బరిలో నిలిచేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

● పంచాయతీలకు ఆదాయాన్ని తెచ్చిన ఎన్నికలు

ఎన్నికలు పంచాయతీలకు కాసుల పంట కురుస్తోంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా ఇంటి పన్ను చెల్లించి ఉండాలనే నిబంధన ఉంది. దీంతో పోటీ చేసే వారు పన్నులు చెల్లిస్తున్నారు. మూడోదశ నామినేషన్ల స్వీకరణ ఘట్టం ప్రారంభమవుతుండడంతో పలు గ్రామాల్లో ఇప్పటికే ఎన్నికల వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో వార్డు సభ్యులు, సర్పంచ్‌లుగా బరిలో నిలిచే అభ్యర్థులు తమ బకాయిలను పెండింగ్‌లో ఉంచుకోవద్దనే ఉద్దేశ్యంతో ఇంటి పన్నులు చెల్లిస్తున్నారు. దీంతో మొండి బకాయిల సమస్య తీరింది. ప్రతి ఏడాది మార్చిలోపు వసూళ్ల ప్రక్రియ ముగుస్తుంది. మరో నాలుగు నెలల ముందే బకాయిలు వసూళ్లు అవుతుండడంతో సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

● అయ్యగారూ.. ముహూర్తం చూడండి



గ్రామపంచాయతీ ఎన్నికల సంగ్రామంలో రెండో విడత నామినేషనర్ల పర్వం మంగళవారంతో ముగియనుంది. మూడో విడుతకు సంబంధించి బుధవారం నుంచి నామినేషన్లు ప్రారంభమవుతాయి. చివరి విడతలో ఉన్న ఆశావాహులు సెంటిమెంట్లకు పదునుపెట్టారు. సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీచేసే వారు తమ నామినేషన్లు ఏ శుభఘడియాల్లో వేయాలని ఆరా తీస్తూ పురోహితులను ఆశ్రయిస్తున్నారు. మూడో విడతలో ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నామినేషనర్ల పర్వ కొనసాగనుంది. అందులో 3వ తేదీ త్రయోదశితో పాటు బుధవారాన్ని శుభకరంగా భావిస్తారు. 4వ తేదీ దత్తాత్రేయ జయంతి ఉన్నా చతుర్థశితో పాటు యుక్త పౌర్ణమితో అంతగా యోగ్యమైన ముహూర్తంగా భావించరు. 5వ తేదీ శుక్రవారంతో పాటు పాడ్యమి తిథి కావడంతో శుభముహూర్తంగా పండితులు చెబుతున్నారు. దీంతో మూడో విడతలో చివరిరోజు నామినేషన్లు ఎక్కువ సంఖ్యలో వేసే అవకాశాలు ఉన్నాయి.

రేపు అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూ

గణేశ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాల కరీంనగర్ లోని రసాయనశాస్త్ర విభాగంలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ బోధించుటకు గురువారం అతిథి అధ్యాపకులకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిం చనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్య ర్థులు తేదీ 4న ఉదయం 11 గంటలకు సర్టిఫి కెట్లతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు రసాయన శాస్త్ర విభాగంలో సంప్రదించాలని తెలిపారు.

విదేశాల్లో విద్య, ఉద్యోగాలపై అవగాహన తరగతులు

గణేశ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని బీసీ, ఇతర విద్యార్థులకు విదేశాలలో ఉన్న అత్యున్నత విశ్వ విద్యాలయాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశాలపై బీసీ స్టడీ సర్కిల్‌లో అవగాహన తరగతులు ప్రారంభిస్తున్నట్లు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఎం.రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆసక్తి కలిగిన కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిఉన్న గ్రాడ్యుయేషన్ (ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్) ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు తేదీ 2-12-2025 నుంచి 21-12-2025 వరకు టీజీ బీసీస్టడీ సర్కిల్ వెబ్సైట్ "www.tgbc-studycircle.cgg.gov.in" ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరింత సమాచారం కోసం ఫోన్: 0878-2268686,040-24071178 సంప్రదించాలని కోరారు.

క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

● కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ● రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల విజేతలుగా వరంగల్, మహబూబ్‌నగర్


ఫైనల్స్‌లో తలపడుతున్న మహబూబ్‌నగర్ - వరంగల్ బాలికల జట్లు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీరించాలని, నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది అని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. రాజన్న సిరిసిల్లజిల్లా కేంద్రం మినీ స్టేడియంలో జరుగుతున్న 8వ రాష్ట్రస్థాయి బాలబాలికల జూనియర్స్ వాలీబాల్ పోటీలు పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్‌పోటీల్లో బాలురవిభాగంలో వరంగల్-ఖమ్మం ఉమ్మడిజిల్లాలు, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ - వరంగల్ ఉమ్మడి జిల్లాల జట్లు తలపడ్డాయి. బాలురవిభాగంలో వరంగల్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో, ఖమ్మం జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో, మహబూబ్‌నగర్ జిల్లాజట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ - వరంగల్ జట్లు తలపడగా, వరంగల్ జిల్లా ప్రథమ స్థానంలో, వరంగల్ జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో, నిజామాబాద్ జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. అనంతరం మినీ స్టేడియంలో ముఖ్య అతిథులు కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్‌నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డిలు విజేతలకు కప్‌లతోపాటు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లను అందించి అభినందించారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడారు. క్రీడాకారుడైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని అన్నారు. క్రీడలలో ప్రపంచ దేశాలతో మనం కూడా పోటీ పడుతున్నామని ఒలింపిక్స్‌లో తెలంగాణ బిడ్డలు పతకాలను తీసుకొస్తున్నారన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు శాప్ చైర్మన్ శివసేనారెడ్డిని తీసుకొచ్చి చూపించామని, త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందన్నారు. క్రీడాకారులు వ్యాయామం చేసుకోవడానికి మినీ స్టేడియంలో జిమ్‌ను త్వరలో ప్రారంభించుకోబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జెల రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి ఎన్వీ హన్మంతరెడ్డి, కోశాధికారి కృష్ణప్రసాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గిన్నె లక్ష్మణ్, రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, ప్రధాన కార్యదర్శి అజ్మీరారాందాస్, ఉపాధ్యక్షులు చింతకింది శ్యాంకుమార్, సహాయ కార్యదర్శులు లక్ష్మణ్, రామస్వామి, కార్యనిర్వహణ కార్యదర్శి పిల్లి రాంచంద్రం గౌడ్, కోశాధికారి కోడం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు గుడ్ల రవి, రెఫరీ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ గణపతి, కన్వీనర్ రవీందర్, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, వివిధ జిల్లాలో వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్‌గా దురిశెట్టి మనోహర్


కలెక్టర్ సత్యప్రసాద్‌కు పూలమొక్క అందిస్తున్న మేనేజర్ మనోహర్

జగిత్యాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెడ్కో ఉమ్మడిజిల్లా మేనేజర్‌గా ట్రాన్స్‌కో రిటైర్డ్ ఏడీఈ దురిశెట్టి మనోహర్‌ను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల సంస్థ (రెడ్కో) ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం జిల్లాకేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్యప్రసాద్‌ను రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్ దురిశెట్టి మనోహర్ మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఈసందర్భంగా మనోహర్ మాట్లాడుతూ హరిత ఇంధన ఉత్పత్తిలో పీఎం సూర్యఘర్, పీఎం-కుసుమ్, ఈవీ-ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, తదితర ప్రభుత్వ పథకాల అమలు, సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటు, వ్యవసాయ భూముల్లో రైతుల ప్రయివేటు సోలార్ ప్రాజెక్టుల స్థాపన, ప్రభుత్వ భవనాలపై సోలార్ పలకల ఏర్పాటు వంటి నిర్దేశించిన లక్ష్యాలను ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేగవంతంగా సాధించాలన్న లక్ష్యంతో నియామకం చేశారన్నారు. తన నియామకానికి సహకరించిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెడ్కోచైర్మన్ డాక్టర్‌శరత్, ఎండీ అనిల తదితరులకు మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు.

పేర్ల మార్పు కోసం డీడీఎన్ అర్చకులకు ఇంటర్వ్యూలు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయకమిషనర్ కార్యాలయంలో మంగళవారం ధూపదీప నైవేద్య పథకం క్రింద గతంలో మంజూరీ అయిన ఆలయాలలో ఏర్పడ్డ పోస్టుల భర్తీలో భాగంగా పేర్లు మార్పు కోసం ఉమ్మడి జిల్లాకు చెందిన అర్చకులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 3మెన్ కమిటీలో ఉమ్మడిజిల్లా సహాయకమిషనర్ నాయిని సుప్రియ పర్యవేక్షణలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ, సంప్రదాయ పరంగా వేములవాడ, కొండగట్టు ఆంజనేయస్వామి, ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి సీనియర్‌అర్చకులు శరత్‌కుమార్‌శర్మ, చిరంజీవస్వామి, నంబి నరసింహస్వామి, సిబ్బంది పాల్గొన్నారు. కాగా నియామకమైనవారు ఆయా ఆలయాల్లో డీడీఎన్ అర్చకులుగా విధులు నిర్వర్తించనున్నారు.

ఘనంగా దత్తాత్రేయ నవరాత్రి ఉత్సవాలు


దత్తాత్రేయ స్వామికి హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రామలింగేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం దత్తాత్రేయ స్వామి ఆలయంలో, గోదావరి నదీ తీరాన గల శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో స్వామి వారలను అందంగా పూలతో అలకంరణ చేసారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఒజ్జల సౌజన్య-నరేందర్ పాల్గొన్నారు.

● మంత్రి పూజలు..

ధర్మపురి క్షేత్రంలోని దత్తాత్రేయ స్వామి సన్నిధిలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అర్చకులు కళొజ్జల శేఖర్ మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.

బద్ది పోచమ్మ సన్నిధిలో భక్తుల సందడి


బద్ది పోచమ్మకు బోనం సమర్పించేందుకు బారులు తీరిన భక్తులు


కొండగట్టు అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడలోని బద్దిపోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు సందడినెలకొంది. ముందురోజు భక్తులు భీమేశ్వరస్వామి దర్శనం చేసుకుని అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. పట్నాలు, కల్లు బెల్లంసాక, తదితర మొక్కులు చెల్లించారు. ఆలయానికి వచ్చినభక్తులతో ఈవో రమాదేవి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటిఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. పర్యవేక్షణలో ఏఈవో జి అశోక్‌కుమార్, పర్యవేక్షకుడు వెంకటప్రసాద్, ఎస్పీఎఫ్‌సిబ్బంది, ఆలయ ఉద్యోగులున్నారు.

కొండగట్టులో..

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం శనివారం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

ఈ నెల 13, 24 తేదీల్లో శబరిమలకు రెండు ప్రత్యేక రైళ్లు

పెద్దపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ఈనెల, వచ్చేనెలలో దక్షిణమధ్య రైల్వే ప్రత్యేకరైళ్లను నడుపుతోంది. అందులో భాగంగా ఈనెల13,24తేదీల్లో నడవనున్న రైళ్లకు పెద్దపల్లి రైల్వేజంక్షన్‌లో హాల్టింగ్ కల్పించారు. ఈనెల 13న ఉదయం రైలు నంబర్ 07117 సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఉదయం 10గంటలకు కొల్లాం వరకు బయలుదేరనున్నది. ఈరైలు బెల్లంపల్లి, మంచిర్యాలమీదుగా రామగుండంకు ఉదయం11:18 గంటలకు చేరుకోనున్నది. పెద్దపల్లిజంక్షన్‌కు 11:38గంటలకు, జమ్మికుంటకుమధ్యాహ్నం 12:20గంటలకు చేరుకోనున్నది. వరంగల్, విజయవాడ, గూడూరు, తిరుపతి,కాట్పాడి,ఈరోడ్, కోయంబత్తూర్, పాలక్కాడ్, ఎర్నాకుళం, కొట్టాయం మీదుగా కొల్లాంకు మరుసటి రోజురాత్రి 7గంటలకు చేరుకోనున్నది. అలాగేఈనెల24న తెల్లవారుజామున 4:25గంటలకు నాందేడ్‌లో బయలు దేరి మరుసటిరోజు రాత్రి 10గంటలకు కొల్లాం చేరుకోనున్నది. ఈరైలు నిజామాబాద్, ఆర్మూర్, కోరుట్ల,జగిత్యాల,కరీంనగర్,పెద్దపల్లి, జమ్మికుంట,వరంగల్ మీదుగా శబరిమలచేరుకోనున్నది. కరీంనగర్‌కు ఉదయం10గంటలకు, పెద్దపల్లికిఉదయం 10:50గంటలకు, జమ్మికుంటకు ఉదయం మధ్యాహ్నం 12:20 గంటలకు చేరుకోనున్నది.

బాబోయ్ కుక్కలు..


గంభీరావుపేటలో కేజీ టూ పీజీ ప్రాంగణంలో కుక్కల గుంపు

గంభీరావుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేటలో వీధి కుక్కలు బెడద అధికమైంది. రోడ్లపై గుంపులు గుంపులుగా శునకాలు తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రోడ్లపై, కాలనీల్లో, స్కూళ్లవద్ద కుక్కల బెడద వెంటాడుతోంది. ద్విచక్ర వాహనదారులపైకి ఒక్కసారిగా దూసుకు వస్తుండటంతో రోడ్డు ప్రమాదానికి గురై గాయాల పాలవుతున్నారు. పిల్లలను బడులకు, సమీప దుకాణాలకు పంపాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వందల సంఖ్యలో ప్రజలు కుక్క కాటుకు గురైన వారు ఉన్నారు. అప్పట్లో లక్ష్మీపూర్ గ్రామ సమీపాన కుక్కలు వెంబడించడంతో ఓ వ్యక్తిబైక్‌పై నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పటికైనా కుక్కల బారినుంచి తమను రక్షించాలని స్థానికులు కోరారు.

వీధి కుక్కల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పలుకాలనీల్లో దాడులకు దిగుతుండటంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ రాంనగర్ ప్రాంతంలో 4రోజుల క్రితం వెంకట రమణారావు అనే వ్యాపారిపై కుక్కలు దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. అతడు ప్రస్తుతం ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడని టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి తెలిపారు. రాంనగర్ నుంచి సంతోష్‌నగర్ వైపు బైక్‌పై వెళుతున్న రమణారావును ఒక ప్రైవేట్ స్కూల్ వద్ద రోడ్డుపై వీధికుక్కలు వెంటపడటంతో అతను తప్పించుకునే ప్రయత్నంలో కిందపడటంతో తలకు తీవ్రగాయాలై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెంటనే గమనించిన స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. బార్యయజమాని అయిన వెంకట రమణారావు ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ట్రాన్స్‌ఫార్మర్‌ను గద్దెపై ఏర్పాటు చేయరూ..


రోడ్డుకు సమానంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ముత్తారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లేమార్గంలో విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ మార్గంలో రోడ్డుపక్కన ట్రాన్స్‌ఫార్మర్ కోసం గద్దె నిర్మించి ఏళ్లుగడుస్తున్నా ఇప్పటికీ అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ బిగించలేదు. అయితే అక్కడున్న ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు సమానంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఈట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలో జూనియర్ కళాశాల ఉండటంతో నిత్యం ఈరోడ్డుగుండా చాలామంది రాకపోకలు సాగిస్తుంటారు. అంతేగాకుండా ఈ రోడ్డు పారుపల్లి గ్రామానికి వెళ్లేమార్గం కావడంతో నిత్యం చాలా మంది ప్రయాణిస్తుంటారు. ఏదైనా వాహనం అదుపుతప్పితే నేరుగా ట్రాన్స్‌ఫార్మర్‌కు ఢీ కొట్టే పరిస్థితులున్నాయి. అంతేగాకుండా పశువులు ట్రాన్స్‌ఫార్మర్ పక్కనున్న గడ్డి మేసేందుకు వెళ్తే విద్యుత్‌షాక్‌కు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి హైలెవల్ గద్దెపై ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాట చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రూ.7,250 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో బుధవారం క్వింటాల్ పత్తి ధర రూ.7,250 పలికింది. మంగళవారం మార్కెట్‌యార్డుకు 58మంది రైతులు 366క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,250, కనిష్ఠ ధర రూ.6,500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.


పత్తి వేలం పాట నిర్వహిస్తున్న వ్యాపారులు

పట్టణ ఆరెకటికె సంఘం అధ్యక్షుడిగా శ్రీధర్

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ ఆరెకటికె సంఘ పట్టణ అధ్యక్షునిగా కోయల్‌కార్ శ్రీధర్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంఘ సమావేశంలో నూతన కమిటీని ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు సుధాకర్, అజయ్, గణేష్‌లు తెలిపారు. ప్రధానకార్యదర్శిగా రాజన్న, కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా సురేష్‌లు ఎన్నికవగా, గౌరవాధ్యక్షునిగా కోయల్‌కార్ కిషన్ ఎన్నికయ్యారు.

కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు

జగిత్యాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కసరత్తులు పూర్తి చేశారు. కలెక్టరేట్ ఆవరణలోని జెండా గద్దె వద్ద తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ప్రత్యేకంగా గద్దెను నిర్మించారు. రాజదాని నుంచి తెలంగాణ తల్లి విగ్రహాన్ని తీసుకవచ్చి ముసుగు కప్పి ఉంచారు. సాధ్యమైనంత తొందరలో ఆవిష్క రించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

చిన్న నీటి వనరుల గణనకు శిక్షణ

బుగ్గారం, డిసెంబరు02 (ఆంధ్రజ్యోతి): చిన్న నీటి వనరుల గణన, రెండవ వ జలాశయాల గణన కార్యక్రమం భాగంగా బుగ్గారం మండలంలో మంగళవారం ఎన్యూమరేటర్లకు క్షేత్ర స్థాయి శిక్షణను అధికారులు అందించారు. మైనర్ ఇరిగేషన్ సెన్సస్ ఛార్జ్ ఆఫీసర్, తహసీల్దార్ భూమేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామాల్లో ఉన్న చెరువులు, బావులు తదితర నీటి వనరులను ప్రత్యక్షంగా పరిశీలించి మొబైల్ యాప్ ద్వారా డిజిటల్ పద్ధతిలో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఖచ్చితమైన గణాంకాలతో నీటి వనరుల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం అవుతాయని అధికారులు పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ అచ్చుతారెడ్డి, ఎంపీఎస్ఓ శిరీష, మండల రెవెన్యూ అధికారి బాపురెడ్డి, గ్రామ పాలనా అధికారులు,గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలి

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రిల్లోనే కాన్పులు జరిగేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని అధికారులకు జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ అంజిత్‌రెడ్డి, డాక్టర్లు శివాణి, వెంకట్ లక్ష్మీ, సిహెచ్‌వో రమేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చికిత్సకు ఆర్థిక సహాయం

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లుల్ల గ్రామానికి చెందిన భూరం చిన్ననర్సయ్య క్యాన్సర్ బాధపడుతుంటగా ఆసుపత్రి ఖర్చులకు నగదు అందజేశారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మిత్రుని గురించి తెలుసుకున్న 2000-01 బ్యాచ్‌కు చెందిన స్నేహితులు మంగళవారం ఆరోగ్యం గురించి తెలుసు కున్నారు. అనంతరం వైద్య ఖర్చులకు కోసం లక్ష రూపాయాలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

'తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి'


మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల టౌన్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణం, అర్బన్ హౌసింగ్ కాలనీల్లో ప్రజలకు తాగునీటికి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని మున్సిపల్ అధికారులను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆదేశించారు. జగిత్యాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల మున్సిపల్‌లో 37 మంది వాటర్‌మెన్‌లు ఉన్నా తాగునీటి సమస్య వస్తుందన్నారు. ప్రజలకు నీటి సరఫరాలో సమస్యలు లేకుండా వాటర్ మెన్‌లు, అధికారులు పర్యవేక్షించాలన్నారు. అమృత్ 2.0 కార్యక్రమంలో నిధులు ఉన్నాయని, తాగునీటి సమస్య లేకుండా చూడలని అధికారులను ఆదేశించారు. ధర్మసముద్రం, ఎస్‌కేఎస్‌ఆర్ వద్ద నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్‌ల పనులను శరవేగంగా పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్బన్ హౌసింగ్ కాలనిలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా వాణిజ్య సముదాయాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేయాలని అధికారులకు సూచించారు. జగిత్యాల పట్టణంలో భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని లేఅవుట్ ప్రకారం సెట్‌బ్యాక్ తీసుకొని ఇంటి, వాణిజ్య సముదాయాలు నిర్మించే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, డీఈ ఆనంద్, టిపిఓ శ్రీనివాస్, మాజి మున్సిపల్ చైర్ పర్సన్‌లు అడువాల జ్యోతి లక్ష్మణ్, గిరి నాగభూషణం, మాజీ కౌన్సిలర్లు చాంద్‌పాషా, కొలగాని సత్యం, దుమాల రాజ్‌కుమార్, టిపిబిఓ శ్రీకర్, ఏఈలు అనిల్, లక్ష్మి పాల్గొన్నారు.

జగిత్యాల సమగ్ర అభివృద్ధికి కృషి

జగిత్యాల అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని 14 వ వార్డులో 15 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు డ్రైనేజి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శంకులపల్లివ్వ, పోచమ్మవాడ రైతు వృత్తి ఆధారిత ప్రాంతమని, పట్టణం నలు మూలల మార్కెట్‌లను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. పట్టణ అభివృద్ధికి 62 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని రాష్ట్రంలోనే అత్యధిక నిధులు జగిత్యాలకు మంజూరు అయ్యాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్‌లు అడువాల జ్యోతి, గిరిభూషణం, మున్సిపల్ కమిషనర్ స్పందన, నాయకులు మాజీ కౌన్సిలర్‌లు కూతురు పద్మ, రాజేష్, కోరె గంగమల్లు, పిట్ట ధర్మరాజు, పంబాల రాము నాయకులు చెట్‌పెల్లి సుధాకర్, బద్దం జగన్మోహన్ రెడ్డి, డిఈ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గసాగర్‌లో సామాజిక బహిష్కరణ

-న్యాయం చేయాలని అధికారులకు బాధితుల వినతి


మెట్‌పల్లిలో ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న గుడేటికాపు కులస్థులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామంలోని స్థలం పంపకంలో అభ్యంతరం తెలిపినందుకు గుడేటి కాపు కులస్థులను నవంబరు 28న వీడీసీ సామాజిక బహిష్కరణ చేశారు. దీంతో గ్రామంలోని గుడేటికాపు కులస్థులు మంగళవారం ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ నీత, డీఎస్పీ రాములు, ఎస్సై కిరణ్‌కుమార్, ఎంపీడీవో సురేష్‌లకు వినతి పత్రం అందజేసి న్యాయం చేయాలని కోరారు. ఈసందర్భంగా బాధిత కుల సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామ శివారులోని వరద కాల్వలో భాగంగా ప్రభుత్వం సేకరించిన భూమిలో కాలువ ఏర్పాటు చేశారన్నారు. దీనిలో కాలువకు అవతలవైపు మిగిలిన భూములను పంచుకుందామని వీడీసీ ఆధ్వర్యంలో కుల సంఘాల నాయకులు పంచడానికి పూనుకున్నారన్నారు. ప్రభుత్వ భూమిని పంచడానికి ఎవరికి హక్కులేదని అన్నందుకు అందరూ కలిసి గుడేటికాపు సామాజిక వర్గాన్ని గ్రామ బహిష్కరణ చేశారని ఆరోపించారు. గ్రామంలోని వీడీసీ నాయకులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

-ఎస్సై సుధీర్‌రావు

రాయికల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు నియమాలు పాటించాలని రాయికల్ ఎస్సై సుదీర్‌రావు అన్నారు. రాయికల్ ఆటో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆటో అడ్డా-3 సమక్షంలో మంగళవారం రాయికల్ పీఎస్ అడ్డా-3 స్టిక్కర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ డ్రెస్ కోడ్ పాటించాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో మద్యం సేవించవద్దని సూచించారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి ప్రతి ఆటో డ్రైవర్‌కు లైసెన్స్ ఇప్పించే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు సామల్ల ప్రసాద్, దుగ్గిల్ల నరేష్, కల్లెడ లింగం, ఎండీ జమీల్, ఎస్కే మోసిన్, ఎండీ షల్లు, ముస్తాక్, కిషోర్, ముబ్బు, అబ్బు పాల్గొన్నారు.

మూడో విడత నామినేషన్లకు వేళాయె..

వెల్గటూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలో మూడవ విడతలో 19సర్పంచ్ స్థానాలు, 168వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ల స్వీకరణ బుధవారం నుంచి ఈనెల 5 వరకు స్వీకరిస్తామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకట ప్రసాద్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు 5 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. వెల్గటూర్, శాఖాపూర్, ముత్తునూర్, పైడిపల్లి, స్తంభంపల్లి క్లస్టర్ గ్రామ పంచాయితీలలో నామినేషన్లు స్వీకరించబడతాయి. వెల్గటూర్ క్లస్టర్‌లో వెల్గటూర్, జగదేవ్‌పేట, కుమ్మరిపల్లి, రాజక్కపల్లి, కోటిలింగాల గ్రామాలకు సంబంధించిన సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లు స్వీకరించబడతాయి. శాఖాపూర్ క్లస్టర్‌లో శాఖాపూర్, కిషన్‌రావుపేట, కప్పారావుపేట, ముక్కట్రావుపేట గ్రామాలు, ముత్తునూర్ క్లస్టర్‌లో ముత్తునూర్, రాంనూర్, చెగ్యాం, తాళ్ల కొత్తపేట గ్రామాలకు సంబంధించిన సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లు స్వీకరిస్తారు. పైడిపల్లి క్లస్టర్‌లో పైడిపల్లి, సంకెనపల్లి గ్రామాలకు సంబంధించిన సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లు స్వీకరిస్తారు. స్తంభంపల్లి క్లస్టర్‌లో స్తంభంపల్లి, వెంకటాపూర్, పాషిగామ, బీరుసాని గ్రామాలకు సంబంధించిన నామినేషన్లు స్వీకరించబడతాయి.

●**బుగ్గారం:** బుగ్గారం మండలంలో 10 సర్పంచ్ స్థానాలు, 96 వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకరణకు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సుమంత్ తెలిపారు. మూడో విడతలు జరుగునున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు గాను నేటినుండి నామినేషన్ల స్వీకరణ చేయనున్నట్లు తెలిపారు. బుగ్గారం గ్రామపంచాయతీ కార్యాలయంలో బుగ్గారం, గోపులాపూర్, వెలుగొండ గ్రామ పంచాయతీలో వెలుగొండ, చిన్నాపూర్, చందయ్య పల్లె, శేకల్ల గ్రామపంచాయతీలో శేకల్ల, యశ్వంతరావు పేట, గంగాపూర్, సిరికొండ గ్రామపంచాయతీలో సిరికొండ మద్దునూర్ గ్రామాల అభ్యర్థులు సర్పంచ్ వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ దాఖలు చేసుకోవాలని ఎంపీడీవో సుమంత్ కోరారు.

●**ఎండపల్లి:** మండల కేంద్రంలో 15 గ్రామ పంచాయతీలు 138 వార్డు సభ్యులకు పోటీ పడనున్నారు. గ్రామాలలో ఎన్నికల హడావిడి ప్రారంభమైంది. 15 గ్రామాలకు గాను 5 క్లస్టర్లను నియమించారు. ఎండపల్లి క్లస్టర్‌లలో రాజారాంపల్లి, ఎండపల్లి, కొండాపూర్ గ్రామాలు, గుల్లకోట క్లస్టర్‌లో గుల్లకోట, చెర్లపల్లి గ్రామాలు, పాతగూడూర్ క్లస్టర్‌లో సూరారం, పాతగూడూర్, గొడిశెలపేట, శానబండ గ్రామాలు, కొత్తపేట క్లస్టర్‌లో కొత్తపేట, అంబారిపేట, పడకల్ గ్రామాలు, ముంజంపల్లి క్లస్టర్‌లో మారేడుపల్లి, ఉండెడ, ముంజంపల్లి గ్రామాలకు సంబంధించిన పోటీ చేసే సర్పంచ్, వార్డు సభ్యులు నామినేషన్ దాఖలు చేయనున్నారు. క్లస్టర్‌లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి, ఎంపీడీవో దొండ కృపాకర్ అధికారులకు సూచించారు. పలు క్లస్టర్‌లను వారు సందర్శించారు. అన్ని కస్టర్‌లలో ఎన్నికల అధికారులను నియమించినట్లు ఎంపీడీవో కృపాకర్ తెలిపారు.

●**పెగడపల్లి:** గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు గాను పెగడపల్లి మండలంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ రావు పేర్కొన్నారు. రెండవ సాదారణ గ్రామపంచాయతీ ఎన్నికలు మూడవ దశలో భాగంగా బుదవారం నుండి ఈ నెల 5 వరకు మూడు రోజుల పాటు మండలంలోని ఎనిమిది క్లస్టర్ గ్రామపంచాయతీలలో నామినేషన్ల స్వీకరణ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు మంగళవారం మండల పరిషత్ కార్యాయంలో నామినేషన్లకు సంబంధించిన సామగ్రిని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌రావు అందజేశారు. అంతకు ముందు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి నామినేషన్ల పైన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీవో శశికుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు , మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

లెక్కదాటితే వేటే..

(ఐదో పేజీ తరువాయి)

హెచ్చరికలు జారీ చేశాయి. ఎన్నికల్లో ధన వ్యయాన్ని తక్కువ చేయాలనే ఉద్దేశంతో కమిషన్ నిబంధనలు విధిస్తున్నప్పటికీ అభ్యర్థులు మాత్రం లోలోపల ఖర్చుకు వెనుకాడడం లేదు. జిల్లాలో మొత్తం 385 జీపీలు, 3,536 వార్డులకు ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో తొలి విడతలో 122 జీపీలు, 1,172 వార్డులు, రెండో విడతలో 144 జీపీలు 1,276 వార్డులు, మూడో విడతలో 119 జీపీలు, 1,088 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మొదటి విడతల నామినేషన్ల పర్వం ముగిసి ప్రచార పర్వానికి తెరలేసింది. ప్రతి నిత్యం వాహనాల ఏర్పాటు, భోజనాలు, మందు, విందు ఖర్చుల పేరిట భారీగానే వెచ్చిస్తున్నారు.

పంచాయతీల్లో రూ.1.50 లక్షల పరిమితి

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అభ్యర్థి నేర చరిత్రకు సంబధించిన వివరాలను నామినేషన్లతో పాటు పొందుపరచాల్సి ఉంటుంది. ఐదు వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో (మేజర్ గ్రామ పంచాయతీ) పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు రూ.2.50 లక్షల వరకు ఖర్చు చేసుకునే వీలుంది. మేజర్ పంచాయతీలలో వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులు రూ.50 వేల వరకు ఖర్చు చేయవచ్చనే నిబంధన ఉంది. ఇక ఐదు వేల లోపు జనాభా ఉన్న గ్రామాల్లో (మైనర్ పంచాయతీలు) పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు రూ.1.50 లక్షల వరకు ఖర్చు చేసే వెసులుబాటును ఎన్నికల కమిషన్ కల్పించింది. చిన్న పంచాయతీలలో వార్డు సభ్యుడిగా పోటీ చేస్తే రూ.30 వేల వరకు ఖర్చు చేసే అవకాశాలున్నాయి. ఖర్చుల పరిమితి దాటితే వేటు తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

సర్పంచ్ బరిలో ఉన్నత విద్యావంతులు


నాగమణి


రాజేశ్

కథలాపూర్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యావంతులు ప్రజా సేవ చేయాలనే తలంపుతో సర్పంచ్ బరిలో దిగారు. కథలాపూర్ మండలంలోని పెగ్గెర్లకు చెందిన బాసారపు నాగరాణి అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సర్పంచ్ పదవి కోసం నామినేషన్ దాఖలు చేశారు. అదే గ్రామానికి చెందిన బొడ్డు బాలు అనే న్యాయవాది, కుంటాల లక్ష్మీ ఐసీడీఎస్ విభాగంలో పని చేస్తుంది. ఉద్యోగానికి రాజీనామా చేసి సర్పంచ్‌గా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. కథలాపూర్‌లో కర్క రాజేశ్ అనే న్యాయవాది, గంభీర్‌పూర్‌లో రిటైర్డ్ కండక్టర్ రాజగంగారాం సర్పంచ్ బరిలో నిలిచారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి సర్పంచ్ బరిలోకి


మాలతి

మల్యాల, డిశంబరు 2(ఆంధ్రజ్యోతి): మల్యాలకు చెందిన వీరబత్తిని మాలతి ప్రజా సేవ కోసం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి సర్పంచ్ బరిలోకి దిగారు. గతంలో దుబాయి ఎయిర్‌పోర్టులో ఉద్యోగం చేసిన మాలతీ కొన్నేళ్లగా హైదరాబాద్‌లోని విప్రో కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. రాజకీయ కుటుంబం కావడం, మాలతి భర్త ప్రతాప్ చురుగ్గా రాజకీయంలో ఉండడంతో సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో నామినేషన్ దాఖలు చేశారు.

● బరిలో మాజీ సైనికుడు..


శ్రీనివాస్

మండలంలోని నూకపల్లికి చెందిన చెవులమద్ది శ్రీనివాస్ అలియాస్ మిల్ట్రీ శ్రీనివాస్ మాజీ సైనికుడు కాగా ప్రస్తుతం సర్పంచ్ పదవికి పోటీలో ఉన్నాడు. ఆర్మీలో హవాల్దర్‌గా పని చేసిన శ్రీనివాస్ ఐదేళ్ల ఏళ్ల క్రితం రిటైర్డ్ అయ్యాడు. ప్రస్తుతం నూకపల్లి సర్పంచ్ పదవి జనరల్‌కు రిజర్వ్ కాగా ఎస్సీ సామాజిక వర్గంకు చెందిన శ్రీనివాస్ నామినేషన్ వేశాడు.

దంపతులు చెరో వార్డులో నామినేషన్లు

మల్యాల, డిశంబరు 2(ఆంధ్రజ్యోతి): మల్యాల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో రెండు చోట్ల భార్యభర్తలు ఇరువురు నామినేషన్లు దాఖలు చేశారు. రెండో వార్డులో మాజీ ఎంపీటీసీ దూస వెంకన్న, మూడవ వార్డులో ఆయన భార్య సుజాత, ఏడవ వార్డులో యాగండ్ల సుమన్, ఎనిమిదో వార్డులో ఆయన భార్య శరన్య నామినేషన్ దాఖలు చేశారు. భార్యభర్తలు చెరో వార్డులో నామినేషన్ దాఖలు చేయడం స్థానికంగా చర్చనీయంశంగా మారింది.

వైభవంగా గుంటి పెరుమాండ్ల కల్యాణం

కోరుట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణ శివారులోని తాళ్ల చెరువు ప్రాంతంలోని గుంటి పెరమాండ్ల దేవాలయంలో స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మార్గశిర మాస ద్వాదశి పురస్కరించుకొని దేవాలయంలో వేదపండితులు బ్రహ్మాణ గారి శంకర్ శర్మ, దేష్‌ముఖ్ పనీంద్ర,ఆదిశేషు, అరుణ్ శర్మ మత్రోత్పరణ్య మధ్య పంచామృత అభిషేకంను జరిపి ప్రత్యేక పూజలను నిర్వహించారు. లక్ష్మీ నారాయణ స్వామి ఉత్సవ విగ్రహాలను నదిలో చక్రస్థానాలను నిర్వహించిన భక్తులు ప్రత్యేక వేదికపై కళ్యాణంను జరిపారు. గణపతి హోమ కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలను జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు , చింత సునిల్, ప్రవీన్, పితాండరి, ప్రసాద్, కొండల్ రావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ దినోత్సవం

కోరుట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సాయిజీనియస్ పాఠశాలలో మంగళవారం కాలుష్య నియంత్రణ దినోత్సవంను కరస్పాడెంట్ చౌకి రమేష్ ఆద్వర్యంలో నిర్వహించారు. పారిశ్రామిక విపత్తులు, మానవ నిర్లక్ష్యం వల్ల ఏర్పాడే కాలుష్యం, పర్యావరణంపై వాటి తీవ్రమైన ప్రభావాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం వ్యాసరచన పోటీలను నిర్వహించి ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధలతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు రుణ మేళా

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మున్సిపల్ ఆధ్వర్యంలో మంగళవారం వీధి వ్యాపారులకు రుణ మేళాను నిర్వహించారు. పట్టణంలోని పలు బ్యాంకులు ఇందులో పాల్గొనగా, వ్యాపారాలు చేసుకునే చిన్న తరగతి వారికి దరఖాస్తులు అందించారు. ఈ సందర్భంగా పలువురు బ్యాంకు మేనేజర్ల మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క లబ్దిదారుడు బ్యాంకులు అందించే రుణాలు తీసుకొని వ్యాపారాభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఏఓ శ్రీనివాస్ గౌడ్, డీఎంసీ సునీత, టీఎంసీ సోమిడి శివ కుమార్, సీఓ జ్యోతి, బ్యాంకు అధికారులు, రిసోర్స్ పర్సన్‌లు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

ధర్మపురి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ బాధ్యత అని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ధర్మపురి పట్టణానికి చెందిన రంగు విరంచి స్వప్నిక ఇటీవల హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన ఫెడరేషన్ కప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసింది. అనంతరం ఆయన సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన న్యూ స్పోర్ట్స్ పాలసీలో భాగంగా క్రీడాకారులకు సపోర్ట్ చేయడం గురించి రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి వద్దకు విరంచి స్వప్నికను మంగళవారం ఆయన పంపించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి సానుకూలంగా స్పందించి గోల్డ్ మెడల్ సాధించిన విరంచి స్వప్నికను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జరుగుతున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్సై కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో గుడేటి కాపు సామాజిక వర్గాన్ని సాంఘిక బహిష్కరణ చేసిన, ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నరని గ్రామస్థులు చేసిన ఫిర్యాదుతో వీడీసీ సభ్యులతో పాటు పలువురుని కేసు వారిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట పది మందిని బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సామాజిక బహిష్కరణ చేసిన, ఎన్నికలను ప్రజాస్వామ్య బద్ధంగా అధికారులు నిర్వహిస్తుండగా గ్రామాల్లో ఏకగ్రీవం కోసం ఒత్తిడి చేసిన, వేలం పాటలు నిర్వహించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కొడిమ్యాల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఆర్‌టీఐ జాతీయ అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డిపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ కోరారు. మంగళవారం ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడు విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో పెన్షన్ డిక్లరేషన్ ఇవ్వనందుకు అధికారులపై ఫిర్యాదు చేసినందుకు దాడి చేయటం సరైనది కాదన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకున్న నందయ్య


నందయ్యకు నియామక పత్రం అందిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు

జగిత్యాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుడిగా గాజంగి నందయ్య మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో నందయ్యకు టీపీసీసీ అధ్య క్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నియామక పత్రం అందించారు.

సర్పంచ్ పదవికి వీడీసీ వేలం

-అధికారుల విచారణ


: జగ్గసాగర్‌లోని సర్పంచ్ అభ్యర్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో గ్రామ పెద్దలు(వీడీసీ) సర్పంచ్ పదవి కోసం వేలం నిర్వహించారు. దీంతో మంగళవారం అధికారులు వేలంపై అభ్యర్థులతో సమావేశం నిర్వహించి విచారణ చేపట్టారు. గ్రామంలో గతంల జరిగిన ఎన్నికల్లో వేలం ద్వారా రెండు సార్లు సర్పంచ్ పదవి పొందిన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుత ఎన్నికల్లో గ్రామ సర్పంచ్ పదవిని వీడీసీ నాయకులు వేలం నిర్వహించగా అభ్యర్థి ఏకంగా రూ.28 లక్షల ఆరువై వేలకు దక్కించుకున్నాడు. అనంతరం సర్పంచ్ పదవికి బరిలో ఉన్న అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకోవాలని, లేనియేడల వారికి రూ.5 లక్షల జరిమానతో పాటు సామాజిక బహిష్కరణ విధించడం జరుగుతుందని గ్రామ పెద్దలు హుకుం జారీ చేశారు. గ్రామంలో జరిగిన వేలం పాట అధికారులు తెలియడంతో రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ సమక్షంలో తహసీల్దార్ నీత, ఎంపీడీవో సురేష్, పోలీసులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అభ్యర్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నీత మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులను వేలం వేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డీటీ ఖాదీర్, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐ ఉమేష్, కార్యదర్శి ప్రశాంత్, అభ్యర్థులు పాల్గొన్నారు.

ముగిసిన రెండో విడత నామినేషన్లు


నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు రమేష్

జగిత్యాల రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల రూరల్, అర్బన్, సారంగాపూర్ మండలాల్లో మంగళవారం నామినేషన్ స్వీకరణ ముగిసింది. జగిత్యాల అర్బన్ మండలంలో సర్పంచ్ స్థానాలకు 37 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 117 నామినేషన్లు దాఖలయ్యాయి. జగిత్యాల రూరల్ మండలంలో సర్పంచ్ స్థానాలకు 179 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 550 నామినేషన్లు వచ్చాయి. సారంగాపూర్ మండలంలో సర్పంచ్ స్థానాలకు119 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు352 నామినేషన్లు దాఖలయ్యాయి.

బీర్‌పూర్ మండలంలో

●**బీర్‌పూర్:** బీర్‌పూర్ మండలంలో రెండో విడత సర్పంచ్ నామినేషన్లు మంగళవారంతో ముగిశాయి. మండలంలో నాలుగు నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయగా బీర్‌పూర్, కొల్వాయి, తాళ్ళధర్మారం, మంగేళ గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాలను మంగళవారం ఎన్నికల పరిశీలకులు గాజర్ల రమేష్ పరిశీలించారు. సర్పంచ్ స్థానాలకు 85 నామినేషన్లు, వార్డు స్థానాలకు 275 నామినేన్లు వచ్చినట్లు ఎంపీడీవో భీమేష్ తెలిపారు.

మల్యాల మండలంలో

●**మల్యాల:** మండలంలో 19 గ్రామపంచాయతీల పరిధిలో సర్పంచ్ పదవులకు 151మంది, 186 వార్డు స్థానాలకు 526 నామినేషన్లు దాఖలు అయ్యాయి. గొర్రెగుండంలో 2, లండాడిపల్లిలో 2, మ్యాడంపల్లిలో 3, రాజారంలో 2, రామన్నపేటలో 5, తక్కళ్లపల్లిలో 2 వార్డు స్థానాలకు ఒక్కటి చొప్పున నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవం కానున్నాయి.

రాయికల్ మండలంలో..

●**రాయికల్:** మండలంలోని 32 మంది సర్పంచ్ అభ్యర్థులకుగాను 205 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 276 వార్డు స్థానాలకు 598 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. రాత్రి 10 గంటల వరకు ఒడ్డెలింగాపూర్ గ్రామంలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది.

కొడిమ్యాల మండలంలో..

కొడిమ్యాల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలో 24 గ్రామ పంచాయతీలలోని ఏడు నామినేషన్ కేంద్రాల్లో నామినేషన్లు ముగిసాయి. సర్పంచ్ పదవులకు 165 మంది, వార్డు స్థానాలకు 509 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేసినట్లు సహాయ జిల్లా ఎన్నికల అధికారి ఎంపీడీవో ఇ. స్వరూప తెలిపారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ

ఇబ్రహీంపట్నం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోదూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం తహసిల్దార్ వర ప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. తేమ సరిగా ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం వేసి, మిల్లులకు తరలించాలని తెలిపారు. వాటిని ట్యాబ్‌లో ఎంట్రీ చేసి, రైతులకు ట్రక్ షీట్ ఇవ్వాలని ఆదేశించారు.

అనంతరం గోదుర్ గ్రామం లోని శ్రీరాజరాజేశ్వర రైస్ మిల్లును తనిఖీ చేశారు. వరి ధాన్యం త్వరగా దిగుమతి చేసుకోవాలని, అలాగే ఓపీఎంఎస్ క్లియర్ చేసి, లారీలను కొనుగోలు కేంద్రాలకు పంపించాలని మిల్లర్లను ఆదేశించారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

జగిత్యాల టౌన్, డిసెంబరు 02(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల నుంచి తప్పించుకోవాలంటే అవగాహన తప్పనిసరి అని డిజిటల్ జాగ్రత్తలు పెరగాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటి బ్యూరో ఆద్వర్యంలో ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని డిజిపి శివదర్ రెడ్డి హైదరబాద్‌లోని టిజిఐసిసి ఆడిటోరియం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై ఏర్పాట్ చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతను వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని, అనుమానాస్పద లింకులు, ఒటిపిలు, బ్యాంక్ వివరాలు ఎవరితో పంచుకోవద్దని, ముఖ్యంగా సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తిగత సమాచారం, ఫోటోలను ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియాను వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యార్థులతో ఫ్రాడ్‌కా ఫుల్‌స్టాప్ ప్రతిజ్ఞ చేయించి పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ కార్యక్రామంలో సైబర్ డిఎస్పీ వెంకటరమణ, ఐటికోర్ ఇన్స్పెక్టర్ రఫిక్ ఖాన్, సైబర్ క్రైం ఎస్ఐ కృష్ణ, దినేష్ తదితరులు పాల్గొన్నారు.